క్లుప్తంగా

అంబేద్కర్ గ్రామ కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్‌లో సోమవారం అంబేద్కర్ యువజన సంఘం గ్రామకమిటీని గ్రామ పెద్దలు నారాయణ, దేవాజీ, వాసుదేవ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా జాడి బాబురావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా అనిల్, శ్యాంరావు, కార్యదర్శులుగా ధరంరాజ్, మారుతి, సహాయ కార్యదర్శులుగా శ్యాంరావు, లక్ష్మణ్, సాగర్, కార్యవర్గ సభ్యులుగా రవి, వినోద్, అజయ్, ధర్మాజీలను ఎన్నుకున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

దహెగాం: మండల కేంద్రంలో పోచమాంబ శీతలాదేవి, నవగ్రహ సహిత సంతాన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభమైంది. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఉదయం విఘ్నేశ్వర పూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ వాస్తు యోగినీ, క్షేత్రపాలిక సహిత భద్రమండల, దేవతా స్థాపనలు, అగ్నిప్రతిష్ట, జలాధివానము, తదితర పూజా కార్యక్రమాలను వేదపండితులు దుద్దిళ్ల మనోహర అవదాని, పార్థివశర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీవో

దహెగాం: మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్, సహకార సంఘం వైస్‌చైర్మన్ రాపర్తి ధనుంజయ్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకూడదని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, నాయకులు క్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌అర్బన్: లింగాపూర్ మండలంలోని కిమ్మనాయక్ తండా గ్రామానికి చెందిన కమలకు మంజూరైన రూ.36వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును సోమవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: బిచ్చగాడు 2
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: బిచ్చగాడు 2

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

రోడ్ల మీదే నిరీక్షణ..!

- ప్రయాణ ప్రాంగణాలు లేక ఇక్కట్లు
- నిలువ నీడ లేక తిప్పలు
- చెట్లు, హోటళ్లే దిక్కు
- పలుచోట్ల నిరుపయోగంగా బస్టాండ్‌లు



దహెగాంలో బస్సు కోసం రోడ్డు పక్కన నిరీక్షిస్తున్న ప్రయాణికులు

దహెగాం: జిల్లాలోని అనేక మండలాల్లో ప్రయాణ ప్రాంగణాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. ఆయా గ్రామాలకు ప్రయాణించే ప్రయాణికులు బస్టాండ్‌లు లేకపోవడంతో నిలువ నీడ లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండ తీవ్రతకు ప్రయాణికులు చెట్ల కింద, హోటళ్లలో నిరీక్షిస్తున్నారు. కొన్ని మండలాల్లో ప్రయాణ ప్రాంగణాలు ఉన్నా ఊరి చివర ఉండడంతో నిరుపయోగంగా మారాయి. ఉన్న బస్టాండ్‌లలో సైతం కనీస తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణ ప్రాంగణాలు కరువు

జిల్లాలో దహెగాం, సిర్పూర్(టి), బెజ్జూర్, కెరమెరి, జైనూర్, రెబ్బెన, చింతలమానెపల్లి మండల కేంద్రాలతో పాటు మరికొన్ని మండలాల్లో కూడా ప్రయాణ ప్రాంగణాలు లేవు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపైనే నిరీక్షిస్తున్నారు. నిత్యం ఆయా మండలాల నుంచి వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. కాని ప్రభుత్వం ప్రయాణికులకు బస్టాండ్‌లు నిర్మించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

పలుచోట్ల నిరుపయోగం..

కొన్ని మండలాల్లో ప్రయాణ ప్రాంగణాలు లేకపోగా మరికొన్ని మండలాల్లో అవసరం లేని వాటిని నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. వాంకిడి మండల కేంద్రంలోని బస్టాండ్ మార్కెట్‌కు దూరంగా నిర్మించడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో వేచి ఉండడం లేదు. దీంతో బస్సు కూడా బస్టాండ్ వైపునకు వెళ్లని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం బస్టాండ్ యాచకులకు అడ్డాగా మారింది.

చెట్లు, హోటళ్లే బస్టాండ్‌లు..

జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో బస్టాండ్‌లు లేకపోవడంతో ప్రయాణికులకు చెట్లు, హోటళ్లే బస్టాండ్‌లుగా మారుతున్నాయి. చెట్ల కింద, హోటళ్లలోనే బస్ కోసం ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. బస్టాండ్‌లలో సౌకర్యాలు కూడా లేకపోవడంతో బస్సుల కోసం వేచి చూడకుండా ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం చేయాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రయాణప్రాంగణాలను నిర్మించి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

చెట్ల కింద నిరీక్షిస్తున్నాం



బస్టాండ్ నిరుపయోగంగా మారడంతో మార్కెట్‌కు వచ్చి హోటళ్లలో, చెట్ల కింద బస్సుల కోసం నిరీక్షిస్తున్నాం. ప్రయాణ ప్రాంగణం ఉన్నా నిరుపయోగంగా మారింది. బస్సులు కూడా అక్కడ ఆగడం లేదు. దీంతో ప్రయాణికులు అక్కడ నిలబడలేక పోతున్నారు.

– బుపల్లి ప్రసాద్, సిర్పూర్(టి)

బస్టాండ్‌లు నిర్మించాలి



బస్టాండ్‌లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎండ, వానలతో తిప్పలు పడుతున్నాం. రోడ్ల మీద బస్సులు, ప్రైవేటు వాహనాల కోసం నిరీక్షిస్తున్నాం. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి బస్టాండ్‌లు నిర్మించాలి.

– దుంద్ర శ్రీను, కోత్మీర్, దహెగాం

ఇబ్బందులు పడుతున్నాం



బస్టాండ్‌లు లేకపోవడంతో ఎటైనా ప్రయాణం చేయాలంటే బస్సులు ఆగే వద్దకు వచ్చి నిలబడి చూస్తున్నాం. కల్వాడ నుంచి ఎక్కువగా బెల్లంపల్లికి వెళ్తుంటారు. కాని బస్టాండ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– బానోత్ బాలు, కల్వాడ, దహెగాం

‘రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు ఇంకెన్నాళ్లు..?’



మాట్లాడుతున్న అందుగుల శ్రీనివాస్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణం పనులు తొమ్మిదేళ్లుగా కొనసాగుతున్నాయని, స్థానిక ఎమ్మెల్యే పట్టింపులేనితనం వల్లే బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరుగుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ నుంచి శ్రీరాంపూర్ వరకు చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణపు పనులు కేవలం రెండేళ్లలోనే దాదాపు పూర్తికాగా, ఇక్కడి రైల్వే బ్రిడ్జి మాత్రం ఇంకా నత్తనడకన సాగుతోందన్నారు. ఎమ్మెల్యే ఇప్పటికైనా చొరవ చూపించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, మాస్ సత్యనారాయణ, వేల్పుల సత్యనారాయణ, వేముల అశోక్,దండు రాజేందర్, మల్లయ్య, సంగరవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై అవగాహన

శ్రీరాంపూర్: మహిళల సంపూర్ణ ఆరోగ్యం సాధికారికతపై అర్పణ చారిటబుల్ ట్రస్ట్ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో మహిళలకు వీటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాలి రమేష్ మాట్లాడుతూ.. మహిళా ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ట్రస్ట్ తరఫున మహిళల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామన్నారు.

‘అండర్ పైప్‌లైన్’ ఏర్పాటు

వాంకిడి: మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో దశాబ్దాలుగా నెలకొన్న మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు అండర్ పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ బండే తుకారం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ. 3లక్షల వ్యయంతో 85 మీటర్ల మురుగు నీటి అండర్ పైప్‌లైన్ నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

శ్రీరాంపూర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద సోమవారం అన్ని గనులు, డిపార్టుమెంట్లకు చెందిన మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించారు. టగ్‌ఆఫ్‌వార్, బాంబ్‌బ్లాస్ట్, త్రో బాల్ పోటీలు నిర్వహించగా, ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సీనియర్ పీఓ ప్రకాష్‌రావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ చాట్ల అశోక్, కో ఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.

సమస్యల్లో ‘సీతానగర్’

- డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- తాగునీటి సౌకర్యం, వీధిదీపాలు కరువు
- పట్టించుకోని అధికారులు



చేతిపంపు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు



కాలువలో నిలిచిన మురుగు నీరు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని సీతానగర్ గ్రామస్తులు సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామంలో మొత్తం 80 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలో మురికి కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా మురికి కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. అనేక సందర్భాల్లో మురికినీరు రోడ్లపై కూడా పారుతుందని, దీంతో నడవలేని పరిస్థితి ఎదురవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారినపడుతున్నామని వాపోతున్నారు. మురికి కాలువల్లో పూడిక తీయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.

రాత్రిళ్లు భయంగా..

గ్రామంలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిసమయాల్లో ఆరుబయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. పాములు, తేళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో భయాందోళన చెందుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచినీళ్లకు ఇబ్బందే..

గ్రామంలో మంచినీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన ఇంటింటికీ నల్లా కనెక్షన్లు సక్రమంగా వేయకపోవడంతో సరిగా నీరందడం లేదు. దీంతో గ్రామ పాఠశాలలో గల బోర్‌వెల్‌పైనే గ్రామస్తులు ఆధారపడుతున్నారు. అయితే గ్రామంలో నాలుగు చేతిపంపులు ఉన్నా వాటిలో నుంచి వచ్చే నీరు తాగడానికి వీలు లేకుండా ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో గల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

వీధి దీపాలు అమర్చాలి



వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు బయటకు వెళ్లలేకపోతున్నాం. పాములు, తేళ్ల బెడద ఎక్కువగా ఉండటంతో భయాందోళన చెందుతున్నాం. వీధి దీపాలు అమర్చాలని స్థానిక అధికారులకు విన్నవించినా ఫలితం కానరావడం లేదు. – రాంటెంకి విజయ్, యూత్ ప్రెసిడెంట్, సీతానగర్

నల్లా బిగించలేదు



మాకు మిషన్ భగీరథ నల్లా బిగించలేదు. దీంతో నీళ్లకు బాగా ఇబ్బంది అవుతుంది. మంచినీళ్ల కోసం పాఠశాలలోని బోర్‌వెల్ దిక్కయ్యింది. బోర్‌వెల్ వద్ద జనాలు ఎక్కువగా ఉండటంతో నీళ్ల కోసం వేచిచూడాల్సి వస్తోంది.

– మౌల్కార్ జానుబాయి, సీతానగర్

నామమాత్రంగా సర్వసభ్య సమావేశం



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



మాట్లాడుతున్న ఎంపీపీ రోజారమణి

బెజ్జూర్: ప్రతీ మూడు నెలలకోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశాలు నామమాత్రంగా సాగుతున్నాయి. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ డోకే రోజారమణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సైతం హాజరు కాకపోవడంతో అరగంటలోనే సమావేశాన్ని ముగించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసే సమావేశాలు వాటి ప్రస్తావన లేకుండా సాగుతున్నాయి. సమావేశంలో ఎంపీడీవో మాధవి, జెడ్పీటీసీ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో వీవోఏలు

కౌటాల: ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం వీవోఏలు చేపట్టిన చలో ఇందిరాపార్క్ కార్యక్రమం నేపథ్యంలో వారిని పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వీవోఏలు శంకర్, ముక్తేశ్వర్, శ్యాంరావు, అశోక్, దేవాజీలను ఉదయం నుంచి సాయంత్రం వరకు కౌటాల పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. వీవోఏలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం సమంజసం కాదని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు అన్నారు. కాగా మండలంలోని పలువురు వీవోఏలు కార్యక్రమానికి తరలివెళ్లారు. ధర్నాకు వీవోఏలు సంఘం మండల అధ్యక్షుడు ఈర్ల వెంకటేశ్, అనంతుల రవి, వడాయి కొండయ్య, ప్రతిభ, మహేశ్వరి, భీమయ్య, కరుణాకర్, బండు తదితరులు తరలివెళ్లారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



అధికారులతో మాట్లాడుతున్న జీఎం

శ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ఏరియా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన తన ఛాంబర్‌లో డిపార్ట్‌మెంట్ల ముఖ్య అధికారులు, గనుల ముఖ్య అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు. 134ఏళ్ల సింగరేణి చరిత్రను, నేడు తెలంగాణల సాధించిన ప్రగతిని ఈ ఉత్సవాల సందర్భంగా ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం షార్ట్ ఫిలీం తీర్చిదిద్దినట్లు తెలిపారు. మైదానంలో ఫొటో ఎగ్జిబిషన్లు, ప్రగతి పుస్తకాల పంపిణీ ఉంటుందన్నారు. ఉద్యోగులకు స్వీట్ ప్యాకెట్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలను జూన్ 5వరకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, ఇందారం ఓసీపీ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవింద్ రావు, ఇతర డీజీఎంలు శివరావు, చంద్రశేఖర్ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

ఇల్లందు క్లబ్‌లో సంబురాలు



నృత్యం చేస్తున్న మహిళలు

మందమర్రిరూరల్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ఆధ్వర్యంలో ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో సోమవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమాన్ని ఏరియా జీఎం సతీమణి, ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు యశోద హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు పాటల, నృత్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీవైపీఎం మైత్రేయ బంధు, సేవా సమితి సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

‘వేతన ఒప్పందంలో కార్మికులకు అన్యాయం’



మాట్లాడుతున్న శ్రీనివాస్

తాండూర్: 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో జాతీయ కార్మిక సంఘాలు కార్మికులకు అన్యాయం చేశాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు విమర్శించారు. ఏరియా వర్క్‌షాప్ వద్ద సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు ఇంటి అద్దె పెంచలేదన్నారు. ఇంక్రిమెంట్ రేట్‌ను పెంచకుండా సిక్ లీవ్‌లను అమ్ముకోకుండా తప్పుడు ఒప్పందం చేసుకోవడంతో కార్మికులకు నష్టం కలిగే అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. కార్మికులకు బేసిక్ పెరుగుదల, ఇంక్రిమెంట్ రేట్ పెరుగుదల కూడా తక్కువగా ఉందన్నారు. ఏ తీరుగా చూసినా కార్మికులకు 11వ వేజ్ బోర్డు ఒప్పందంలో మేలు జరగలేదని విమర్శించారు. సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు ప్రకాష్‌రావు, మంగీలాల్, సదాశివ, శ్రీనివాస్, రమేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

వాంకిడి: మండలంలోని గోయగాం గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలం బండకాస గ్రామానికి చెందిన కుమురం చిత్రు, మారుతి, సిడాం లింగు ద్విచక్ర వాహనంపై మహారాష్ట్రకు బయలుదేరారు. ఈ క్రమంలో గోయగాం గ్రామ సమీపంలో జాతీయ రహదారి– 363పై వీరు బైక్‌తో లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో చిత్రు, మారుతి కాళ్లకు గాయాలు కాగా, లింగు తలకు గాయమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స కోసం వాంకిడి ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై డి.సాగర్ తెలిపారు.

కార్గో సేవా కేంద్రం ప్రారంభం

దండేపల్లి: ఆర్టీసీ కార్గో సేవా కేంద్రాన్ని దండేపల్లిలో రిషిత ఆన్‌లైన్ సెంటర్ వద్ద సోమవారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీకార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు.